క్లుప్తంగా

మాచన్‌పల్లికి మూడు ఎకరాల భూమి ఇవ్వాలి

చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి భీంభరత్



నిర్మలకు వినతిపత్రం భీంభరత్, రాంరెడ్డి

షాబాద్: మాచన్‌పల్లి గ్రామానికి మూడు ఎకరాల భూమిని కేటాయించాలని చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్ కోరారు. శుక్రవారం ఆయన తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (టీజీఐఐసీ) చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డిని నగరంలో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. మండల పరిధిలోని మాచన్‌పల్లిలో గ్రామ పంచాయతీ భవనం, డంపింగ్‌యార్డ్, క్రీడా మైదానం ఏర్పాటుకు మూడు ఎకరాల భూమిని కేటాయించాలని కోరామన్నారు. గ్రామంలోని ప్రభుత్వ భూమి ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం పరిశ్రమల పేరుతో సెంటు భూమి లేకుండా సేకరించడంతో ఇబ్బందిగా మారిందన్నారు. ప్రభుత్వం స్పందించి గ్రామాభివృద్ధికి భూమిని కేటాయించాలని కోరామని చెప్పారు. ఆయన వెంట టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఎన్.రాంరెడ్డి, మాచన్‌పల్లి మాజీ సర్పంచ్ సత్తయ్య, నాయకులు రమేశ్, గిరీశ్ గౌడ్, నరేశ్ గౌడ్, యాదయ్య, సుమన్ తదితరులున్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

ఎంపీడీఓ వెంకయ్య



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకయ్య

శంకర్‌పల్లి: గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని శంకర్‌పల్లి ఎంపీడీఓ వెంకయ్య అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. నిత్యం గ్రామాల్లో చెత్త సేకరణ చేపట్టాలన్నారు. ప్లాస్టిక్ తొలగించి తడి, పొడి చెత్త వేర్వేరు గా చేసి ఎరువు తయారు చేయాలని సూచించారు. కొత్తగా మరుగుదొడ్లు నిర్మించుకునే వారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలని, అదే విధంగా ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఉండేలా చూడాలన్నారు. ప్రజలకు క్లోరిఫికేషన్ చేసిన ప్యూరిఫైడ్ తాగునీరు సరఫరా చేయాలన్నారు. పైప్‌లైన్ల లీకేజీలు గుర్తించి మరమ్మతులు చేయించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంపీఓ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నిరోధక టీకాలు



అప్పారెడ్డిగూడలో పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ స్రవంతి

షాబాద్: పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికార్లు డాక్టర్ స్రవంతి, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. షాబాద్ మండల పరిధిలోని అప్పారెడ్డిగూడ, మన్‌మర్రి, ఊబ్బగుంట, చందనవెళ్లి గ్రామాల్లో శుక్రవారం సిబ్బందితో కలిసి పశువులకు టీకాలు వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మూగజీవాల ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందాం

ప్రత్యేక అధికారి అనురాధ



మాట్లాడుతున్న అనురాధ

మొయినాబాద్‌రూరల్: సమస్యలను పరిష్కరించుకుని గ్రామాభివృద్ధి చేసుకోవాలని హిమాయత్‌నగర్ ప్రత్యేక అధికారి, మండల వ్యవసాయాధికారి అనురాధ అన్నారు. శుక్రవారం పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి గ్రామంలోని పాఠశాలల హెచ్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, వాటర్‌మెన్‌లతో జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి అనురాధ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని సర్వేనంబర్ 149, 150లో ప్రైవేట్ వెంచర్, వెంకటేశ్వర కాలనీలో రాందేవ్ కిరణా దుకాణం వారు అక్రమంగా నల్లా కలెక్షన్ తీసుకున్నారని గ్రామస్తులు మల్లేశ్ యాదవ్, ప్రభాకర్ ఫిర్యాదు చేశారు. దీంతో గ్రామంలోని నీటి సరఫరా సరిగా జరగడం లేదని అందులో పేర్కొన్నారు. సెలవు దినాల్లో గుర్తు తెలియని వ్యక్తులు మందు తాగి ఖాళీ బాటిల్స్‌తో పాఠశాల ప్రాంగణాన్ని అపరిశుభ్రంగా మార్చుతున్నారని హెచ్‌ఎం అంజనేయులు ఫిర్యాదు చేశారు. సమావేశంలో మాజీ వార్డు సభ్యుడు యాదయ్య, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, కవిత తదితరులు పాల్గొన్నారు.

కలగానే 'డబుల్'!

- ఇళ్ల కోసం పదేళ్లుగా లబ్ధిదారుల ఎదురుచూపు
- సురంగల్‌లో ఇప్పటికీ అసంపూర్తిగానే నిర్మాణాలు
- అజీజ్‌నగర్‌లో పూర్తయినా పంపిణీ చేయని వైనం



అజీజ్‌నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు

మొయినాబాద్: డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం పదేళ్లుగా పేదలు కంటున్న కలలు నెరవేరడం లేదు. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వీటి నిర్మాణం చేపట్టినా ఇప్పటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. ఫలితంగా అర్హులైన వారికి ఎదురుచూపులు తప్పడం లేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన టీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని ప్రకటించింది. ఇందులో భాగంగా మొయినాబాద్ మండలంలోని సురంగల్, అజీజ్‌నగర్, కనకమామిడి, చిలుకూరు, చిన్నమంగళారం, తోలుకట్ట తదితర గ్రామాలకు 2016లో డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేసింది. అప్పటి రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి చేతులమీదుగా పలు గ్రామాల్లో వీటి నిర్మాణానికి శంకుస్థాపన సైతం చేశారు. అనంతరం రెండేళ్లకు సురంగల్, అజీజ్‌నగర్ గ్రామాల్లో మాత్రమే డబుల్ నిర్మాణ పనులు ప్రారంభించారు. సురంగల్‌కు 20 ఇళ్లు మంజూరవగా 16 మాత్రమే నిర్మించారు. అవి కూడా అసంపూర్తిగానే ఉన్నాయి. అజీజ్‌నగర్‌లో 40 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. సుమారు ఎనిమిదేళ్ల పాటు పనులు కొనసాగాయి. నిర్మాణాలు పూర్తయినా ఇప్పటి వరకూ లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు.

ఏడాదిన్నర క్రితమే అర్హుల గుర్తింపు...

గ్రామాల్లో నిర్మించిన డబుల్ బెడ్‌రూంలు ఇచ్చేందుకు ఏడాదిన్నర క్రితమే పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. స్థానిక నేతలు, ప్రజలు, అధికారుల సమక్షంలో అర్హులను గుర్తించారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందే లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించాలని బీఆర్‌ఎస్ సర్కార్ ఎంతగానో ప్రయత్నించింది. కానీ పనులు పూర్తి కాకపోవడంతో ఇది సాధ్యం కాలేదు. అంతలోనే అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఇళ్ల పంపిణీ ప్రక్రియ ఆగిపోయింది. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కొత్త ప్రభుత్వంలోనైనా డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు అందించాలని అధికారులు ప్రయత్నం చేశారు. కానీ అంతలోనే మళ్లీ పార్లమెంటు ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. పార్లమెంటు ఎన్నికలు సైతం పూర్తయి నాలుగు నెలలు గడుస్తున్నా డబుల్ బెడ్‌రూం ఇళ్లు లబ్ధిదారులకు అందని ద్రాక్షలా మారాయి. ఇళ్లు ఎప్పుడిస్తారో.. సొంతింటి కల ఎప్పుడు నెరవేరుతుందోనని లబ్ధిదారులు ఆశతో ఎదురు చూస్తున్నారు.



సురంగల్‌లో అసంపూర్తిగా నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణం

కరెంటు, నీటి కనెక్షన్ ఇవ్వాలి

అజీజ్‌నగర్‌లో చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తయింది. కరెంట్, నల్లా కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. ఈ విషయాన్ని ఆయా శాఖల అధికారులకు తెలియజేశాం. ఈ పనులు పూర్తయితే లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించవచ్చు. సురంగల్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు.

– విజయ్‌కుమార్, పీఆర్ డీఈ, మొయినాబాద్

కేంద్ర పథకాలను వివరించండి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను పార్టీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడ, నాగులపల్లి, రాసుమళ్ళగూడ, ఎలికట్ట, రంగంపల్లి, మొగిలిగిద్ద, ఎల్లంపల్లి, కాశిరెడ్డిగూడ, చింతగూడ, రాయికల్, బూర్గుల గ్రామాల్లోని 30 పోలింగ్ బూత్‌లలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలో మూడవ సారి అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి, దేశ రక్షణే లక్ష్యంగా ముందుకు సాగుతతోందన్నారు. కేంద్ర పథకాలను అర్హులైన వారికి అందించాల్సిన బాధ్యత పార్టీ నాయకులపై ఉందన్నారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నాయకులు తమ సత్తా చాటాలన్నారు. నియోజకవర్గంలో 50వేల సభ్యత్వాలు నమోదు చేయడమే లక్ష్యంగా నాయకులు ముందుకు సాగాలన్నారు. రాష్ట్రంలో మార్పు పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ప్రభుత్వం పది నెలలు కావస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు సుధాకర్, నరేందర్‌రెడ్డి, సురేశ్, రవి, భీమయ్య, చందర్, అజయ్, సుమన్, కిరణ్, లింగం, శివ, అనిల్, రమేష్‌గౌడ్, ప్రశాంత్, దినేశ్‌రెడ్డి, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

29న చలో తుక్కుగూడ

కొందుర్గు: మహేశ్వరం నియోజకవర్గంలోని తుక్కుగూడలో ఈ నెల 29న నిర్వహించనున్న మాదిగల ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు ఆనంద్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మాదిగల హక్కుల పరిరక్షణకు ఏర్పాటు చేసిన ఈ సభకు కులస్తులంతా పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్, శేఖర్, కుమార్, రాకేశ్, రమేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆనంద్

ఐదు శాతం రిజర్వేషన్ కల్పించండి

సంచార జాతుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నరేందర్



వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

షాద్‌నగర్: సంచార జాతుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి కేశురాంను సంచార జాతుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం వారు వినతిపత్రం అందజేశారు. సంచార జాతుల వారమైన తాము ఊరికి దూరంగా ఉంటూ దుర్భరమైన జీవితాలను అనుభవిస్తున్నామని.. స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా తమ జాతులు అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. ఆర్థికంగా, సామాజికంగా, విద్యా, ఉపాధి పరంగా అన్ని రంగాల్లో వెనకబాటుకు గురయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. సంచార జాతుల అభివృద్ధికి బీసీ కమిషన్ చర్యలు తీసుకోవాలని, విద్యా, వైద్యం, రాజకీయ రంగాల్లో సంచార జాతులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంచార జాతుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నరేందర్, వెంకటనారాయణ, డేవిడ్, ఎల్లయ్య, శ్రీను, రామలింగం, కుర్మయ్య, శ్రీను తదితరులున్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలుకు డిమాండ్

- ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయండి
- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహ

షాద్‌నగర్‌రూరల్: ఎస్సీ వర్గీకరణను చేపట్టాలనే డిమాండ్‌తో నిర్వహించనున్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాదిగ ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ కోరారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఫరూఖ్‌నగర్ మండల ఎమ్మార్పీఎస్ ముఖ్యనాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నర్సింహ మాట్లాడుతూ.. దళితులపై ప్రభుత్వం నిర్లక్ష్యవైఖరి అవలంబిస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి వర్గీకరణ అమలుకు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు నిర్ణయాన్ని అమలు చేయకుండా మాదిగలపై వంచిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వర్గీకరణ సాధనలో భాగంగా ఈ నెల 29న తుక్కుగూడలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న మాదిగ ధర్మయుద్ధ మహాసభకు ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హాజరు కానున్నారని అన్నారు. ఈ ధర్మయుద్ధ మహాసభకు ఉద్యోగులు, నిరుద్యోగులు, యువకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బాల్‌రాజ్, నాగభూషణ్, ఆంజనేయులు, శ్రీనివాస్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు దేవుళ్లతో సమానం



విద్యార్థికి నగదు ప్రోత్సాహం అందజేస్తున్న పట్నం మహేందర్‌రెడ్డి తదితరులు

చేవెళ్ల: వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనది, వైద్యులను ప్రజలు దేవుళ్లతో సమానంగా చూస్తారని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాలలో శుక్రవారం మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థులకు ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. కాలేజీ వైస్ చైర్మన్ వరదారెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్య, వైద్యాన్ని అందించిన ఘనత ప్రాచీన భారతదేశానిదేనని స్పష్టంచేశారు. అనంతరం వైద్య విద్యలో ప్రతిభ చాటిన పలువురు విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. ధన్వంతరి వంటి ఎంతో మంది ప్రాచీన వైద్యులు ప్రపంచానికి వైద్యజ్ఞానాన్ని అందించారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ పి.వీ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ జోయారాణి, సూపరింటెండెంట్ రామక్రిష్టారెడ్డి, అధ్యాపక బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది



చేవెళ్ల: ఎన్కేపల్లిలో విద్యార్థులకు నూతన వస్త్రాలు అందజేస్తున్న ఎంఈఓ, దాతలు



మొయినాబాద్ రూరల్: విద్యార్థులకు టై, బెల్టులు అందజేస్తున్న మహేందర్ ముదిరాజ్ తదితరులు

- ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలి
- ఎంఈఓలు పురన్‌దాస్, లక్ష్మణ్‌నాయక్

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని మండల విద్యాధికారి ఎల్.పురన్‌దాస్ అన్నారు. ఎన్కేపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఎస్‌జీటీ ఉపాధ్యాయురాలు కమల దంపతులు విద్యార్థులకు దీపావళి పండుగ కోసం నూతన వస్త్రాలు బహూకరించారు. ఎంఈఓ, హెచ్‌ఎం ఎండీ మునీర్ చేతుల మీదుగా వీటిని విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలన్నారు. అనంతరం ఉపాధ్యాయురాలు కమల దంపతులను శాలువాలతో సన్మానించారు. ఈకార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ అనిత, ఉపాధ్యాయులు వెంకటయ్య, అశ్విని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేయూతనివ్వాలి

షాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులను దాతలు ఆదుకోవాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. మండల పరిధిలోని అప్పారెడ్డిగూడ ప్రాథమిక పాఠశాలలో ఇదే గ్రామానికి చెందిన దాత సందీప్‌గౌడ్ సుమారు రూ.35 వేల రూపాయల విలువగల నోట పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్, లైబ్రరీ రాక్స్, సౌండ్ బాక్స్, గ్రీన్‌బోర్డు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు కావలసిన అవసరాలను దాతలు ముందుకు వచ్చి వారికి సహాయం చేయాలన్నారు. తాను సంపాదించిన దాంట్లో సైతం కొంత ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఖర్చు చేస్తానని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పూజిత శ్రీనివాస్‌గౌడ్, రాజునాయక్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు తదితరులున్నారు.



షాబాద్: అప్పారెడ్డిగూడలో స్టేషనరీ పంపిణీ చేస్తున్న ఎంఈఓ, దాత సందీప్‌గౌడ్

సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య..

మొయినాబాద్ రూరల్: ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసుకుందామని కాంగ్రెస్ మత్స్యకారుల సంఘం చైర్మన్ నారాయణపురం మహేందర్‌ముదిరాజ్, వార్డు సభ్యుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు కొత్తపల్లి తిరుపతి రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బాకారంలో విజయం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జెడ్పీహెచ్‌ఎస్, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు టై,బెల్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుధాకర్‌యాదవ్, చేవెళ్ల అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ వెంకటేశ్‌గౌడ్, హెచ్‌ఎం నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు మరమ్మతులు



మరమ్మతుల అనంతరం నందిగామ-వీర్లపల్లి రోడ్డు

సాక్షి ఎఫెక్ట్..

ప్రారంభమైన రాకపోకలు



సాక్షి

కొట్టుకుపోయిన రహదారి

'సాక్షి'లో ప్రచురితమైన కథనం

నందిగామ: నందిగామ-వీర్లపల్లికి రోడ్డు మీదుగా వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వాగు తెగిపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఇదే విషయమై 'సాక్షి' దినపత్రికలో ఈ నెల 14న 'కొట్టుకుపోయిన రహదారి' శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన సంచాయతీ రాజ్ అధికారులు, ఆయా గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయించారు. దీంతో వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి.

ఉపాధ్యాయుడికి సన్మానం



చెర్కుపల్లిలో ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న గ్రామస్తులు

కొందుర్గు: ఆరేళ్లుగా చెర్కుపల్లి పాఠశాలలో పనిచేసి, బదిలీపై వెళ్లిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌ను శుక్రవారం గ్రామస్తుల ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ గాయత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏ ఉద్యోగి అయినా ప్రజలకు చేసిన సేవలే గుర్తిండిపోతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణవేణి, పాఠశాల హెచ్‌ఎం శివారెడ్డి, చైర్‌పర్సన్ లావణ్య, గ్రామస్తులు యాదయ్య, జనార్దన్, జీవన్ కుమార్ పాల్గొన్నారు.

సదర్ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

కాంగ్రెస్ సీనియర్ నాయకుడుశ్రీనివాస్‌యాదవ్




సన్నాహక కార్యక్రమంలో పాల్గొన్న యాదవ సంఘం నాయకులు

షాద్‌నగర్‌రూరల్: నగరంలో ఈ నెల 27న నిర్వహించనున్న సదర్‌సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గడ్డం శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. సదర్ సమ్మేళనం సన్నాహక సమావేశంలో భాగంగా శుక్రవారం పట్టణంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో దున్నపోతుల ప్రదర్శనను నిర్వహించారు. అనంతరం శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు సమీపంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈ నెల 27న సదర్ సమ్మేళనాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. ఈ ఉత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యు డు అనిల్‌కుమార్‌యాదవ్, మాజీ పార్లమెంట్ సభ్యులు అంజన్ కుమార్‌యాదవ్ హాజరవుతారని చెప్పారు. ఈ ఉత్సవంతో యాదవుల ఐక్యతను చా టుదామన్నారు. నియోజకవర్గంలోని ప్రతీ గ్రామం నుంచి యాదవులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యా దవ సంఘం నాయకులు మల్లేశ్ యాదవ్, రఘునాథ్ యాదవ్, బాల్‌రాజ్ యాదవ్, సరితాయాదగి రి యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, వెంకటేశ్ యాదవ్, రవి యాదవ్, అశోక్‌యాదవ్, సంతోష్ యాదవ్, శివరాములు యాదవ్, శ్రీశైలం యాదవ్, అనిల్ యాదవ్, లింగం యాదవ్ పాల్గొన్నారు.

తవ్వారు.. మరిచారు

రోడ్డుపై మట్టికుప్పలతో ప్రయాణికుల ఇక్కట్లు



వెంకమ్మగూడ-వీర్లపల్లి మార్గంలో తీసిన గోతులు, రోడ్డుపై మట్టికుప్పలు

నందిగామ: ఓ వైపు రోడ్లన్నీ గుంతలు.. మరో వైపు రోడ్ల వెంట కేబుల్ ఏర్పాటుకు తీసిన గోతులుతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పట్టించుకునే వారు లేక వాహనదారులు అవస్థలు పడుతున్నారు. మండల పరిధిలోని చేగూరు నుంచి వెంకమ్మగూడ, వీర్లపల్లి, అప్పారెడ్డిగూడ మీదుగా పాత జాతీయ రహదారికి వెళ్లే రోడ్డులో కేబుల్ ఏర్పాటుకు తవ్వకాలు చేపట్టారు. వెంకమ్మగూడ నుంచి వీర్లపల్లికి వెళ్లే దారిలో రోడ్డు తవ్వి మట్టిని కుప్పగా రోడ్డుపై పోయడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. ఎదురెదురుగా వాహనాలు వస్తే పక్కకు తొలగేందుకు గంటల తరబడి నిరీక్షించిక తప్పడం లేదు. పనులు పూర్తికాగానే గోతులు పూడ్చాల్సిన సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహించడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై మట్టికుప్పలు తొలగించి గోతులు పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.